రైతులు ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- కరీంనగర్ డెయిరీలో ముగ్గుల పోటీలు

విజేతకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తదితరులు

కార్పొరేషన్, జనవరి 10: రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమపై దృష్టిసారించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలోని కరీంనగర్ డెయిరీలో బుధవారం రైతు కుటుంబాల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉదయం ఈ కార్యక్రమాన్ని నాబార్డు అధికారులు ప్రారంభించగా, విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లక్ష మందికి పైగా పాడి రైతులకు జీవనోపాధి కల్పించడం అభినందనీయమని కొనియాడారు. పాడి పశువుల ద్వారా ఆదాయం, రైతు కుటుంబాల సంక్షేమం కోసం పథకాలు తీసుకురావడం హర్షణీయన్నారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ, 25 ఏళ్లుగా డెయిరీలో ప్రతి సంక్రాంతికి రైతుల కుటుంబసభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో రూ. 80 కోట్లతో పూర్తి ఆటోమెటెడ్ మెగా డెయిరీని నిర్మించినట్లు పేర్కొన్నారు. డెయిరీ ద్వారా రోజుకు రెండు లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నామన్నారు. అమ్మకాలను కూడా పెంచేందుకు అన్ని విధాలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డెయిరీ మనది అన్న భావన కలిగేలా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డెయిరీ ఎండీ శంకర్‌రెడ్డి, సలహాదారు హనుమంతరెడ్డి, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మంత్రి పొన్నం మార్నింగ్ వాక్

కళాశాల ఆవరణలో వాకింగ్ చేస్తున్న మంత్రి పొన్నం, నాయకులు, వాకర్స్

రాంనగర్, జనవరి 10: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో బుధవారం ఉదయం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ చేశారు. వాకింగ్‌కు వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల కోసం కోటి 25 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, వాకర్స్, తదితరులున్నారు.

భక్తాంజనేయ ఆలయంలో హోమం

కమాన్‌చౌరస్తా, జనవరి 10: జిల్లా కేంద్రంలోని 53వ డివిజన్ కశ్మీర్ గడ్డ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. మేయర్ యాదగిరి అపర్ణ-సునీల్ రావు దంపతులు హాజరై పూజలు చేశారు. పూజల్లో కార్పొరేటర్ శ్రీదేవి-చంద్రమౌళి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి

కార్పొరేషన్, జనవరి 10: స్థానిక జ్యోతినగర్‌లోని వివేకానంద విగ్రహ చౌరస్తాను సుందరీకరించి, వివేకానంద చౌరస్తాగా నామకరణం చేయాలని యువజన సంఘాల సమితి నాయకులు బుధవారం మేయర్ సునీల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 12న వివేకానంద జయంతి సందర్భంగా చౌరస్తాలో ఏర్పాట్లు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ యువజన సమితి నాయకులు వొడ్నాల రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

టీఎన్జీవోస్ కార్యవర్గం

తిమ్మాపూర్, జనవరి10: టీఎన్జీవోస్ తిమ్మాపూర్ యూనిట్ అధ్యక్షుడిగా పోలు కిషన్ ఎన్నికయ్యారు. బుధవారం ఎల్ఎండీలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజయ్య, ధనలక్ష్మి, వెంకటరెడ్డి, రాజ్‌కుమార్, యుగంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, శశాంక్, లక్ష్మణ్, రాజ్‌కుమార్, ఎస్ రాజ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా లచ్చయ్య, శ్రీనివాస్, సరస్వతి, సంతోష్, ప్రచార కార్యదర్శిగా పవిత్ర, కార్యవర్గ సభ్యులుగా లావణ్య, శ్వేత, కుమారస్వామి, శ్రీనివాస్, రమేశ్, మహేందర్, రవీంద్రస్వామి, మతీన్, నాగరాజు, రాజమల్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ రాజేశ్ భరద్వాజ్ తెలిపారు. ఎన్నికకు సహకరించిన కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, రాష్ట్ర నాయకుడు హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సహ అధ్యక్షుడు శ్రీనుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ బీఎన్‌రావు ఔదార్యం

విద్యానగర్, జనవరి 10: గంగాధర మండలం సర్వారెడ్డిపల్లికి చెందిన దాసరి కనకమ్మ పదేళ్లుగా మోకాలు నొప్పితో బాధపడుతున్నది. దవాఖానల్లో చూపించుకోగా, శస్త్ర చికిత్సకు రూ. 2 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కాగా, కనకమ్మ కుటుంబసభ్యులు డాక్టర్ బీఎన్‌రావును కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన బీఎన్‌రావు డాక్టర్ బీఎన్‌రావుహెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆదర్శ దవాఖానలో కనకమ్మకు ఉచితంగా మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించారు. బుధవారం డాక్టర్ బీఎన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ, త్వరలోనే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పాత జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఫౌండేషన్ సేవలు విస్తరిస్తామన్నారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆదర్శ దవాఖాన ఆర్థోపెడిక్ వైద్యులు సత్యనారాయణరెడ్డి, అనిల్, హెల్త్ ఫౌండేషన్ సభ్యులు అలీం, రూన్సీ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఆన్‌లైన్ చేయాలి

కలెక్టరేట్, జనవరి 10: ప్రజాపాలన దరఖాస్తులు పూర్తి అవగాహనతో ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఆమె దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ చేసిన ప్రతి దరఖాస్తుకు నంబర్ వస్తుందని, దానిని దరఖాస్తుపై నమోదు చేయాలని ఆదేశించారు.

అల్ఫోర్స్ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ నరేందర్ రెడ్డి, విద్యార్థులు

సిద్ధార్థ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాల్ రెడ్డి

విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

కమాన్‌చౌరస్తా, జనవరి 10: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబురాలు, ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, మంకమ్మతోట, విద్యానగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబురాలను విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లి, జనవరి 10: ముకరంపురలోని వాణీనికేతన్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలను విద్యా సంస్థల చైర్‌పర్సన్ విజయఅయోధ్య రామారావు ప్రారంభించారు. పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల వంటకాలను తిని ఆస్వాదించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, ముగ్గులు వేసి పతంగులు ఎగురవేశారు. పాఠశాల డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ ప్రశాంత్, కిడ్స్‌కేర్ ఇన్‌చార్జి జేసన్, హనుమంతరావు, నీలకంఠం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, జనవరి10: మండల కేంద్రంలోని ఎంజేపీలో సంక్రాంతి సంబురాలు అట్టహాసంగా జరిపారు. ప్రిన్సిపాల్ విమల, టీచర్లు రజిత, అన్నపూర్ణ, సంగీత, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

వాణీనికేతన్ పాఠశాలలో ...

తిమ్మాపూర్: ఎంజేపీలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో ప్రిన్సిపాల్ విమల, ఉపాధ్యాయులు

ఆకుపచ్చదనమే జీవన ఇంధనం

కమాన్‌చౌరస్తా, జనవరి 10: ఆకుపచ్చదనమే జీవన ఇంధనం అని, రాబోయే తరాల కోసం ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఎన్జీసీ కో-ఆర్డినేటర్ విద్యాసాగర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 50 పాఠశాలల విద్యార్థులకు, సైన్స్ ఉపాధ్యాయులకు నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్జీసీ) కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ, బయోడైవర్సిటీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఈవో జనార్దన్ రావు మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో పర్యావరణ అంశాలపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి, ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ జయపాల్ రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఎం స్వదేశ్‌కుమార్, సెక్టోరల్ అధికారి అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సదుపాయాల కల్పనే ధ్యేయం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జనవరి 10: నగరంలో ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా బల్దియా పాలకవర్గం పని చేస్తున్నదని మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టం చేశారు. స్థానిక 35వ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో రూ.32 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో నాలుగేళ్లుగా మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన రోడ్లు, డ్రైనేజీలు, చౌరస్తాల అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులు నగరపాలక సంస్థకు వచ్చేలా తమ పాలకవర్గం పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, బల్దియా అధికారులు, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ధైర్యంగా ఉండాలి

మానకొండూర్ రూరల్, జనవరి 10: విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, ఆపద సమయంలో హెల్ప్‌లైన్ వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం 'స్నేహిత' కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ను ఎస్‌వో, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ గోపాల్, ఏఈవో సాయికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, కార్యదర్శి మధుమిత, వీవోఏ స్వరూప ఉన్నారు.

చిగురుమామిడి, జనవరి 10: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ రాజేశ్, మండల వైద్యాధికారి సందీప్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో స్నేహిత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్‌వో సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం, జనవరి 10: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంప్రసాద్, ఏఎన్ఎం శ్రీవాణి, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర, జనవరి 10: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పూర్ణిమ గౌతమి, డీపీఎం శ్రీనివాస్, సీడీపీవో కస్తూరి, వైద్యాధికారి శ్వేత, ఏఈవో వేదిక, కార్యదర్శి సాయిలు, సూపర్‌వైజర్ రమాదేవి ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

NAME CHANGE

పోలు శారద వాణి D/o. **పోలు శంకరయ్య** (పెళ్లికి ముందు) అను నా పేరును పెళ్లి తరువాత **స్వర్గం వాణి** W/o. **స్వర్గం నరేష్** గ్రా & మం|| హుజురాబాద్, జి|| కరీంనగర్, T.S గా మార్చబడినది.

CHANGE OF NAME

★I, GOGURI MADHUSUDAN, R/o. 8-5, Sriramulapally, Kodimial, Jagityal, TS. I have Changed My Name as GOGURI MADHUSUDHAN REDDY, S/o. Goguri Raji Reddy.

NT-319326

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని దీక్ష

ముకరంపుర, జనవరి 10: పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైల్వే ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నదని విమర్శించారు. కార్యక్రమంలో కొండ రమేశ్, పెద్ది శ్రీనివాస్, గుజ్జ ప్రశాంత్, ఎస్ రాజు, నక్క వెంకటేశ్, మీనేష్, టీ శ్రీనివాస్, రాజేశ్, కే మహేందర్, బీ రవి, వై కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మానకొండూర్, జనవరి 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సులోచన. ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీస్

మానకొండూర్, జనవరి 10 బీఆర్ఎస్‌లో కొనసాగుతూ, పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కొండపలకల నాయకుడు కడారి ప్రభాకర్‌కు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు బుధవారం షోకాజ్ నోటీస్ జారీచేశారు. నోటీస్ అందిన మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంవీఐకి ఘన వీడ్కోలు

హుజూరాబాద్‌టౌన్, జనవరి10: హుజూరాబాద్ ఎంవీఐగా పని చేసిన ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్ పెద్దపల్లికి బదిలీ అయ్యారు. కాగా, బుధవారం హుజూరాబాద్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. సిరాజ్ ఉర్ రహమాన్‌ను లారీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, అసోసియేషన్ నాయకులు శాలువాతో సన్మానించారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సలీం, కార్యదర్శి మజీద్, ఉపాధ్యక్షుడు జానీ, సివిల్ సప్లయ్ కాంట్రాక్టర్లు మల్లయ్య, హరిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి

తిమ్మాపూర్ రూరల్, జనవరి 10: విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని స్నేహసంబంధాలను పెంపొందించడంతో పాటు క్రీడా స్ఫూర్తిని చాటాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. బుధవారం రేణికుంటలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి 30 మంది క్రీడాకారులకు టీ షర్టులను గ్రామానికి చెందిన వంశీ, మహేశ్ వితరణ చేయగా ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఎనిమిది మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, జనవరి 10: ఎస్‌యూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 8 మంది మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఒకరికి కరోనా పాజిటివ్

విద్యానగర్, జనవరి 10: కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో ఓపీ బేసిస్‌లో వచ్చిన వారికి ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయగా ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు సూపరింటెండెంట్ వీరారెడ్డి తెలిపారు. ప్రజలు కొవిడ్ నిబంధనలు పాటించాలని కోరారు.

బాలలకు బంగారు భవితను అందించాలి

కలెక్టరేట్, జనవరి 8: బాలలకు బంగారు భవితను అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం స్నేహిత ఫస్ట్ వన్ కార్యక్రమం నిర్వహించగా, ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు అన్ని అంశాలపై అవగాహన కల్పించడానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. బాలలకు ఇబ్బందులు ఉంటే ధైర్యంగా చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు సమాచారం అందించేలా ప్రోత్సహించాలన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీడబ్ల్యూవో సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ప్రోగ్రాం అధికారి డేవిడ్ రాజు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, డీఆర్డీవో శ్రీలత, డీసీపీవో శాంత, సఖీ అధికారి లక్ష్మి, 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో జాగ్రత్త

తిమ్మాపూర్ రూరల్, జనవరి10: విద్యార్థులు సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో స్నేహిత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సమాజంలో ఎదురయ్యే ఘటనలను విపులంగా చెప్పారు. తప్పులు ఎలా జరుగుతాయో, వాటి నుండి ఎలా బయటపడాలో వివరించారు. బాలికలు ఆపదలో ఉంటే షీ టీంకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా వైద్యాధికారి జువేరియా, సీడీపీవో సబితాకుమారి, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, సర్పంచ్ నీలమ్మ, ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ ఆదిత్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కలెక్టరేట్, జనవరి 10: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్ట్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో రోడ్లు ఆక్రమణ, మరమ్మతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, డిపో-1 మేనేజర్ మల్లేశం, ట్రాన్స్ పోర్ట్ అధికారి చంద్రశేఖర్ గౌడ్, ఆర్ అండ్‌బీ అధికారి సాంబశివరావు, జిల్లావైద్యాధికారి లలితాదేవి, పంచాయతీరాజ్ ఈఈ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లెక్క తప్పొద్దు

తిమ్మాపూర్, జనవరి 10: రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం లెక్క తప్పొద్దని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర రైస్‌మిల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్‌మిల్లు మొత్తం తిరిగి బియ్యాన్ని పరిశీలించారు. సివిల్ సప్లై అధికారులు, మిల్లు యజమాని ప్రభాకర్‌రావుతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి, మేనేజర్ రజినీకాంత్, తహసీల్దార్ కనకయ్య తదితరులున్నారు. అలాగే కలెక్టర్ ఎల్ఎండీలోని నర్సరీని పరిశీలించి, మొక్కల నిర్వహణ బాగుండాలని ఆదేశించారు.

మొక్కనాటిన వీవీఆర్



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు

గంగాధర, జనవరి 10: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు (వీవీఆర్) తన జన్మదినం సందర్భంగా వెలిచాలలో మొక్కలు నాటారు. అలాగే, వెంకటేశ్వర్‌రావు జన్మదిన వేడుకలను రామడుగు, గంగాధర మండలాల్లో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని వీవీఆర్ నివాసంలో రామడుగు మండల నాయకుల ఆధ్వర్యంలో వీవీఆర్ కేక్ కట్ చేశారు. గంగాధర సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ దూలం బాలాగౌడ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రామడుగు యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. రామడుగులో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, నాయకులు కిష్టారెడ్డి, కలిగేటి లక్ష్మణ్, అజయ్‌కుమార్, కరుణాకర్, మహేందర్‌రెడ్డి, శేఖర్, మల్లేశం, తడగొండ మల్లేశం, గంగాధరలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచులు మల్లేశం, లావణ్య-అంజి, కనకయ్య, మాజీ సర్పంచ్ శివశంకర్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో అలరించిన ఫ్రెషర్స్ డే

తిమ్మాపూర్, జనవరి 10: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'సంస్కృతి' పేరిట బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు డిజైన్ వర్క్‌షాప్‌ను విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు ప్రసాదరాజు, వెంకటేశ్వర్లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

మానకొండూర్ రూరల్, జనవరి 10: ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లికి చెందిన హరికృష్ణారెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా నందగిరి సాయినాథ్ (26) పని చేస్తున్నాడు. సాయినాథ్ బుధవారం వ్యవసాయ కూలీలను తీసుకురావడానికి ట్రాక్టర్‌లో శ్రీనివాస్‌నగర్ వైపు వస్తున్నాడు. వేంకటేశ్వర ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సాయినాథ్ తల్లిదండ్రులు గతంలోనే చనిపోగా, బంధువుల దగ్గర ఉంటున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ భాస్కరాచారి తెలిపారు.

ఉన్నతిపై శిక్షణ

హుజూరాబాద్ టౌన్, జనవరి 10: విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా తీర్చిదిద్దడానికే 'ఉన్నతి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్ సమ్మిరెడ్డి, నోడల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హుజూరాబాద్, సైదాపూర్ మండలాల హైస్కూల్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఉన్నతిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌పీలు తిరుపతి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన తనిఖీలు

తిమ్మాపూర్, జనవరి 10: ఎల్ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ క్వార్టర్లలో గల కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ క్యాంపు కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు బుధవారం సైతం తనిఖీలు నిర్వహించారు. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న పత్రాలు, డాటాను సేకరించినట్లు విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి తెలిపారు. ఈ సోదాల్లో విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు ప్రశాంత రావు, నిరంజన్ రెడ్డి, విజిలెన్స్ డీఈ శ్రీనివాస్, ఏఈ శశిధర్, ఎస్ఐ నారాయణ బాబు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కొత్తపల్లి, జనవరి 10: నగరంలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ విద్యార్థి విశాల్ జాతీయస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రం అందుకున్నాడు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విశాల్‌ను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, జనవరి 10: నగరంలోని శ్రీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రఘుపతి పేర్కొన్నారు. విద్యార్థులు గుడిపల్లి అమూల్య, కశ్యప్‌నేహను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ విమల, ప్రిన్సిపాల్ విద్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బహుమతుల ప్రదానం

కొత్తపల్లి, జనవరి 10: భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మై భారత్-వికసిత భారత్ @ 2047 అంశంపై బుధవారం స్థానిక ఎస్సారార్‌లో విద్యార్థులకు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలు ఈషా పర్వేజ్, శివశంకర్ సాయి, రోషినికి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె

విద్యానగర్, జనవరి 10: ఎల్ఐసీలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికారుల, ఉద్యోగుల జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గంట పాటు సమ్మె చేపట్టారు. ఈ క్రమంలో కరీంనగర్ డివిజనల్ కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. నాయకులు చలం, వాసు, లక్ష్మీకాంతం, వామన్ రావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణమాఫీ వెంటనే ప్రకటించాలి

కలెక్టరేట్, జనవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంట రుణమాఫీ ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కాయిత వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని మంకమ్మతోటలో గల సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తపల్లి, జనవరి 10: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సుభాష్ యువజన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. యువజన సంఘం అధ్యక్షుడు చెక్కిళ్ల సాయిరాం గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఆగ్రహం

శంకరపట్నం, జనవరి 10: కన్నాపూర్ రైతు వేదికలో బుధవారం ఎఫ్ఎంసీ అనే ప్రైవేట్ మందుల కంపెనీ ప్రమోషన్ మీట్ నిర్వహించారు. కాగా, ఈ కార్యక్రమానికి సర్పంచ్, ఎంపీటీసీ సహా గ్రామ పెద్దలను ఆహ్వానించలేదు. కాగా, అధికారిక కార్యక్రమాలు నిర్వహించే రైతు వేదికలో ఓ ప్రైవేట్ కంపెనీ కార్యక్రమానికి అనుమతి ఇవ్వడంపై రైతులు ఏవో ఆర్ శ్రీనివాస్‌పై మండిపడ్డారు. ఈ విషయమై ఏవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా, క్లస్టర్ ఏఈవో తనకు తెలియకుండానే కారోబార్ వద్ద ఉన్న తాళం చెవి తీసుకుని కంపెనీ ప్రతినిధులకు ఇచ్చారని తెలిపారు.